ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

శుక్రవారం 5 ఏప్రిల్ 2024

గురువారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 42.1°C | కనిష్ఠం : 24.0°C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.35 గం.

సహర్ : శనివారం ఉ : 4.44 గం.

ఉన్నట్టా.. లేనట్టా..?

- ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్, మల్లంపల్లి మండలంపై సందిగ్ధం
- అసెంబ్లీ ఎన్నికల వేళ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన గత సర్కారు
- కొత్త ప్రభుత్వంలో వినిపించని ఊసు
- 'జిల్లాల కుదింపు' ప్రచారంతో స్థానికుల్లో సందేహాలు



మల్లంపల్లి గ్రామం





ములుగు, ఏప్రిల్ 4: ములుగు జిల్లాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్, మల్లంపల్లి మండల ఏర్పాటు అంశంపై సందిగ్ధం కొనసాగుతోంది. రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా ఏర్పాటు దిశగా ఎలాంటి చర్యలు లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. ఇంతలోనే పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులోకి రావడం, మరో రెండు నెలల వరకు తటస్థ స్థితి కొనసాగనున్న నేపథ్యంలో కొత్త రెవెన్యూ డివిజన్, మండల ఏర్పాటు ఉన్నట్టా..? లేనట్టా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గత అసెంబ్లీ ఎన్నికల వేళ..

ఏటూరునాగారం కేంద్రంగా రెవెన్యూ డివిజన్, మల్లంపల్లి కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటుకోసం కొన్నేళ్లుగా ప్రజా ఉద్యమాలు జరిగాయి. రాజకీయ పార్టీలు మద్దతు తెలపడంతో పలు సందర్భాలలో గత ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి వచ్చింది. ఈక్రమంలో 2023అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వేర్వేరు సందర్భాల్లో గెజిట్ నోటిఫికేషన్లను జారీ చేసింది. తొలుత ములుగు మండలంలోని మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేసేందుకు సెప్టెంబరు 23న గెజిట్‌ను విడుదల చేసింది. ములుగు జిల్లా పరిధిలోని మల్లంపల్లి, రామచంద్రాపురం రెవెన్యూ గ్రామాలతోపాటు హనుమకొండ జిల్లా పరిధిలోని శాయంపేట మండలం కాట్రపల్లి రెవెన్యూ గ్రామాన్ని అంతర్భాగంగా ఈ నోటిఫికేషన్ ఇచ్చింది. ఆతర్వాత అక్టోబరు 7న ఏటూరునాగారం కేంద్రంగా ఏటూరునాగారం, తాడ్వాయి, కన్నాయిగూడెం, మంగపేట, వెంకటాపురం, వాజేడు మండలాలతో కొత్త డివిజన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు గెజిట్ విడుదలైంది. 15రోజులలోగా అభ్యంతరాలను స్వీకరించిన అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఎన్నికల్లో లబ్ధికోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందనే విమర్శలు వచ్చినా.. ప్రజామోదం కావడంతో పెద్దగా ప్రభావం చూపలేదు. పైగా పెద్దఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. అన్ని రాజకీయ పార్టీలు ఈ క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నించాయి.

ఉలుకు లేదు.. పలుకులేదు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్, మల్లంపల్లి మండల ఏర్పాటు గెజిట్లపై కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అసలు ఈ అంశంపై ఉలుకూ పలుకూ లేకపోవడం మాటలా ఉంచితే.. గత పాలకులు పాలనా సౌలభ్యం పేరుతో ఇష్టారీతిన జిల్లాల విభజన చేశారని, పది జిల్లాలను 33కు పెంచడం వల్ల ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదని, ప్రస్తుత ప్రభుత్వం కుదించేందుకు ఆలోచన చేస్తోందనే వార్తలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుండటంతో ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్, మల్లంపల్లి మండల ఏర్పాటుపై అనుమానాలు రెట్టింపవుతున్నాయి. ఈ క్రమంలోనే పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలవుతుండటంతో ప్రభుత్వ వర్గాల నుంచి ఎలాంటి ప్రకటన వెలువడే అవకాశం లేకుండా పోయింది. దీంతో అసలు కొత్త డివిజన్, కొత్త మండలం ఏర్పాటవుతాయా లేదా అన్న సందేహాలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

నిష్పక్షపాతంగా ఓటింగ్ సాగాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 4: స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులపై ఉందని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై పీవోలు, ఏపీవోలకు భూపాలపల్లి పట్టణంలోని మాంటిస్సోరీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియపై పీవోలు, ఏపీవోలు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమావళిని ఉల్లంఘించొద్దన్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్ల వినియోగం గురించి సమగ్రంగా తెలుసుకోవాలన్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చోటుచేసుకున్నా కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఫారం-12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ జారీ చేస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక సెలవు మంజూరు చేస్తామన్నారు. పోలింగ్ ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల సంఘం అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. శిక్షణకు 560 మంది హాజరుకావాల్సి ఉండగా గైర్హాజరైన 22 మందికి షోకాజ్ నోటీసులు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



శిక్షణ శిబిరంలో పీవోలు, ఏపీవోలతో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

నష్టాలు తగ్గించుకుంటున్నాం..

సింగరేణి జీఎం శ్రీనివాసరావు

కాకతీయఖని, ఏప్రిల్ 4: సింగరేణి భూ పాలపల్లి ఏరియాలో నష్టాలను తగ్గించు కుంటున్నామని ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ లాభాల బాట పట్టేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సింగరేణి భూపాలపల్లి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి అట్టడుగు స్థాయిలో ఉందని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జీఎం స్పందించారు. గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను చేరుకునేందుకు భూగర్భ గనుల ద్వారా కాస్త నష్టాలు ఉన్నప్పటికీ ఓపెన్‌కాస్ట్ గనులు లాభాల్లో పయనిస్తున్నాయని వివరించారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఏరియా రూ.518.61 కోట్ల నష్టాల్లో ఉండేదని, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.557.20 కోట్ల నష్టాల్లో పయనించిందని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో అధిక బొగ్గు ఉత్పత్తి, రవాణా చేసి నష్టాలను చాలా వరకు తగ్గించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఏరియా రూ.398.22 కోట్ల నష్టాల్లో ఉందని తెలిపారు. భూసేకరణకు సంబంధించి ఎన్నో ప్రతికూల పరిస్థితులను దాటుకుంటూ 73శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించామని పేర్కొన్నారు. అండర్‌గ్రౌండ్ గనుల్లో ఎస్డీఎల్ యంత్రాల కాలపరిమితి చెల్లడం, ఇసుక కొరత ఉండడం వల్ల ఉత్పత్తి కాస్త తగ్గిందన్నారు. ఇప్పటికే గోదావరి ఇసుక టెండర్ ప్రక్రియ మొదలు పెట్టామని, ఎస్డీఎల్ యంత్రాల కొనుగోలు పూర్తయ్యిందని వివరించారు.

ఖర్గే, రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం



ములుగులోని జాతీయ రహదారిపై ఖర్గే, రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 4: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్పీ) నాయకులు గురువారం ములుగులో దహనం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు ఆధ్వర్యంలో నాయకులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ చౌరస్తాలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా శ్యాంబాబు మాట్లాడుతూ తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు ఉంటే ఒక్క సీటు కూడా మాదిగలకు కేటాయించకపోవడం బాధాకరమని అన్నారు. 75 శాతం ఉన్న మాదిగ జనాభా ఉండగా మూడు స్థానాల్లో కనీసం రెండు సీట్లు కూడా కేటాయించకుండా మాదిగలను అణచివేతకు గురి చేస్తున్నారని విమర్శించారు. మాదిగలను అన్నిరంగాల్లో మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రాస్తారోకో చేస్తున్న ప్రదేశానికి ఎస్సై వెంకటేశ్వర్ చేరుకుని ఆందోళనకారులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మరాఠ రవీందర్, వావిలాల సాంబశివరావు, ఎంపెల్లి శంకర్, తోకల రాంబాబు, బొచ్చు అరవింద్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

భగభగ..



ఎండ తీవ్రత వల్ల భూపాలపల్లిలో జనం బయటకు రాక నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

- ఠారెత్తిస్తున్న ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి
- ఉమ్మడిజిల్లాలో 40డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ములుగు, మహబూబాబాద్ జిల్లాలో అత్యధికం
- బొగ్గుగని ప్రాంతాల్లో మరింత వేడిమి
- ఆరెంజ్ అలర్ట్ జారీతో యంత్రాంగాలు అప్రమత్తం

హనుమకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎండలు భగభగమంటున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం, నగటున 40డిగ్రీలకు పైనే నమోదవుతుండటం, వడగాలులు, ఉక్కపోత ప్రారంభం కావడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 గంటలకే సూరీడు సుర్రుమంటుండగా.. మధ్యాహ్నం సమయంలో జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. దీంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కూడళ్లు వెలవెలబోతున్నాయి. గతేడాది కన్నా ఈ సారి ఎండలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా.. మార్చిలో పగటి ఉష్ణోగ్రతలు 30 నుంచి 38 డిగ్రీలు నమోదవగా.. ఏప్రిల్‌లో తీవ్రత పెరుగుతూ వస్తోంది. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధిక ప్రగటి ఉష్ణోగ్రత 42 డిగ్రీలకు చేరుకుంది. అత్యధికంగా ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 42.1 డిగ్రీలు నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 41డిగ్రీలు, జనగామ జిల్లాలో 40.5డిగ్రీలు, వరంగల్ జిల్లాలో 40.3 డిగ్రీలు, హనుమకొండ జిల్లాలో కాస్త తక్కువగా 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో ములుగులో మరింతగా 42.9 డిగ్రీలు, 42.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 42.6 డిగ్రీలు, జనగామలో 41.6 డిగ్రీలు, వరంగల్‌లో 41.7 డిగ్రీలు, హనుమకొండలో 41.5 డిగ్రీలకు పెరగొచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది. ఎండలు పెరుగుతుండటంతో జన సంచారం లేక రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు మందగించాయి. దీంతో ఆ పేద, చిరు వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలోనే పండ్లు, పండ్ల రసాలు, కొబ్బరి బొండాలు, మజ్జిగ, అంబలి, సోడ తదితర పానీయాలకు డిమాండ్ పెరిగింది. మరోవైపు వడదెబ్బబారిన పడుతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా బయట పనులకు వెళ్లే కార్మికులు, ఉపాధి కూలీలు ఎక్కువగా అనారోగ్యం పాలవుతున్నారు. ఉష్ణోగ్రతల తీవ్రత వల్ల వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు అస్వస్థతకు గురవుతున్నారు. ఈ క్రమంలో అన్ని జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వేసవి కాలంలో వచ్చే వ్యాధులపై పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి ఎండబాధితులకు తక్షణ వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు.

నిప్పుల కుంపటిగా బొగ్గుగనులు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని బొగ్గుగని ప్రాంతాలైన భూపాలపల్లి టౌన్, తాడిచెర్ల, ఘనపురం మండలంలోని మాధవరావుపల్లె ఓపెన్ కాస్ట్‌లు, వాటి పరిసరాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. సహజంగా బొగ్గునిల్వలు, ఓపెన్‌కాస్ట్‌లు ఉన్న చోట వేడిమి ఎక్కువగా ఉంటుంది. దీనికితోడు ఎండలు మండిపోతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు ఇలాగే పెరుగుతూ పోతే నీటితో ఈ ప్రాంతాలను చల్లబరచాల్సి ఉంటుంది. అలాగే సిబ్బందికి సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితి వస్తుంది. ఉద్యోగులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. బయట 40 డిగ్రీలు ఉంటే ఓపెన్ కాస్ట్‌లలో 45 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రత ఉండే అవకాశం ఉండటంతో సంస్థ అధికారులను అప్రమత్తం చేస్తోంది.

ములుగు ఏజెన్సీలో మాడుపగిలే ఎండ

- వెంకటాపురంలో అత్యధికంగా 41.9 డిగ్రీల ఉష్ణోగ్రత

ములుగు, ఏప్రిల్ 4: ములుగు జిల్లాలో వేసవి ప్రభావం తీవ్రమైంది. పగటిపూట అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం వెంకటాపురం(నూగూరు) మండలంలో 41.9 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. వాజేడు మండలం ధర్మవరంలో 41.5 డిగ్రీలు, వెంకటాపూర్(రామప్ప) మండలం వెల్తుర్లపల్లి వద్ద 40.6, మంగపేట మండలం మల్లూరులో 40.5, ఏటూరునాగారంలో 40.3, తాడ్వాయి మండల కేంద్రంలో 40డిగ్రీల సెల్సియస్ రికార్డు అయ్యింది. దీంతో అధికారులు ఈ మండలాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. రాత్రి పూట కూడా వేడి తగ్గడంలేదు. ఉక్కపోతతో జనం ఇబ్బంది పడుతున్నారు. అత్యవసరమైతే గానీ ఉదయం 10గంటలు దాటిన తర్వాత ఇల్లు విడిచి బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

తుక్కుగూడ సభను విజయవంతం చేయండి

డీసీసీ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఐత ప్రకాష్‌రెడ్డి

కాటారం, ఏప్రిల్ 4: కాంగ్రెస్‌తోనే అన్ని సామాజిక వర్గాలకూ న్యాయం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు ఐతా ప్రకాశ్‌రెడ్డి అన్నారు. కాటారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. దేశాభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 6న తుక్కుగూడలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ సహా ఏఐసీసీ నేతలు సభకు హాజరవుతున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రవేశపెట్టే మేనిఫెస్టోను సీఎం రేవంత్‌రెడ్డి, మేనిఫెస్టో కమిటీ చైర్మన్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు తుక్కుగూడ సభ ద్వారా పార్టీ అగ్రనేతలు దిశానిర్దేశం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వామన్‌రావు, చల్ల తిరుపతిరెడ్డి, రఘురాంనాయక్, మోయిజ్‌హరుణ్‌ఖాన్, సమ్మయ్య, ఉంసింగ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వాగులు, వంకలు దాటి..

కాలినడకన గొత్తికోయగూడానికి చేరుకున్న వైద్య సిబ్బంది

ఇంటింటికీ తిరుగుతూ ఫీవర్ సర్వే



వాగు దాటుకుంటూ గొత్తికోయగూడానికి వెళ్తున్న వైద్యసిబ్బంది

గోవిందరావుపేట, ఏప్రిల్ 4: సికిల్‌సెల్ స్క్రీనింగ్, ఏఎన్‌సీ కార్యక్రమంలో భాగంగా గోవిందరావుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది మండల కేంద్రానికి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న జారుడుబండ గొత్తికోయగూడానికి గురువారం కాలినడకన బయల్దేరారు. దట్టమైన అడవి మధ్య వాగులు దాటుకుంటూ చేరుకున్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య ఆదేశాల మేరకు గూడెంలో ఇంటింటికీ తిరుగుతూ ఫీవర్ సర్వే నిర్వహించారు. గొత్తికోయలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పోరిక చంద్రకాంత్ మాట్లాడుతూ వేసవిలో గూడెం వాసులు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఉదయంపూట మాత్రమే పనులు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి చేరుకుని చికిత్స తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు జంపయ్య, శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కాలిక, శ్రీలత, భారతి, వనిత, సరోజన, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

గోదావరి కరకట్టను పరిశీలించిన కలెక్టర్



రామన్నగూడెం కరకట్ట వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఏటూరునాగారం రూరల్, ఏప్రిల్ 4: మండలంలోని రామన్నగూడెం, రాంనగర్ వద్ద గోదావరి కరకట్టను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం పరిశీలించారు. రాంనగర్ వద్ద గోదావరి కోతకు గురైన ప్రాంతాల్లో 6 కిలో మీటర్ల మేర కరకట్ట నిర్మాణానికి 102 ఎకరాలను సేకరించామని, దానికి సంబంధించిన సర్వేను 2022లోనే చేపట్టినట్టు కలెక్టర్‌కు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని కరకట్ట దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి మరమ్మతు పనులను చేపట్టాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. గోదావరి ఉధృతి వల్ల ముంపు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

రామన్నగూడెం, రాంనగర్ వద్ద గోదావరి కరకట్టను పరిశీలించిన అనంతరం మండలంలోని ముల్లకట్ట గ్రామాన్ని కలెక్టర్ సందర్శించారు. మిరప పంటలను పరిశీలించిన ఆమె రైతులతో మాట్లాడారు. కాలానుకూలంగా పంట మార్పిడి చేయాలన్నారు. లాభాదాయకమైన పంటలను ఎంచుకోవానాలన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్‌జీ, ఇరిగేషన్ సీఈ విజయ్ భాస్కర్, ఎస్ఈ మోహన్‌రావు, ఈఈ జగదీశ్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయ్ చందర్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి వేణు తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన ప్రాంత పరిశీలన

మంగపేట: మండలంలోని పొద్మూరు శివారులోని గోదావరి ప్రాంతాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. అడిషనల్(రెవెన్యూ) కలెక్టర్ మహేంద్రజీ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. వరదలు

మిగతా 8వ పేజీలో...

గొర్రెల మందపైకి దూసుకుపోయిన కారు



ఎలుకుర్తి క్రాస్ వద్ద గొర్రెలపైకి కారు దూసుకుపోవడంతో మృతి చెందిన, గాయపడిన గొర్రెలు

ధర్మసాగర్ (హనుమకొండ జిల్లా), ఏప్రిల్ 4 : అతివేగంతో కారు గొర్రెల మందపైకి దూసుకుపోవడంతో ఏడు గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన దిన ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి గ్రామ శివారులో గురువారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం... ధర్మసాగర్‌కు చెందిన గొర్రెలకాపరులు గంటె రమేష్, గంటె సంపత్, గంటె సాంబరాజు, అల్లాడి పెద్దపురం, గంటె పెద్ద కొంరయ్య, చిన్న కొంరయ్యలకు చెందిన గొర్రెలను మేతకు తోలుకుపోయారు. శాయిపేట్ వైపు నుంచి గొర్రెలను మేపుకొని తిరిగి ధర్మసాగర్‌కు వస్తుండగా ఎలుకుర్తి క్రాస్ వద్దకు రాగానే కారు అతివేగంతో వచ్చి గొర్రెల మందపైకి దూసుకుపోయింది. దీంతో ఏడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో తొమ్మిది గొర్రెలకు గాయాలయ్యాయి. కాగా, మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన నిందితులను గొర్రెలకాపరులు పోలీసులకు అప్పగించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



వస్కుల రాజు(ఫైల్)

మడికొండ, ఏప్రిల్ 4 : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కాజీపేట మండలం మడికొండలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రాజబాబు తెలిపిన వివరాలప్రకారం. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన వస్కుల రాజు (37)కు మడికొండ ఎస్సీ కాలనీలోని రజితతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబంతో మడికొండలో నివాసముంటున్నాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. గతంలో ఆటో నడుపుకునే రాజు కొంతకాలంగా అప్పుల బాధతో ఇబ్బంది పడుతున్నాడు. గతంలో అతను ఒకసారి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. మంగళవారం రాత్రి ఇంట్లో పడుకున్న అతడు ఉదయం వేళ ఇంట్లో వారు లేచి చూసే సరికి ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డులో ఉరి వేసుకుని కనిపించాడు. అతడిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

రైలులో బాలుర తరలింపు

పట్టుకుని చైల్డ్‌లైన్‌కు అప్పగించిన పోలీసులు

కాజీపేట, ఏప్రిల్ 4 : రైలులో తరలిస్తున్న బాలకార్మికులను పోలీసులు పట్టుకుని చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎం. సంజీవరావు తెలిపిన ప్రకారం. గోరఖ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య నడిచే గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం వివిధ ప్రాం తాల నుంచి బాలురను తరలిస్తున్నారన్న సమాచారంతో కాజీపేటలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 11 మంది బాలురు, వారిని తరలిస్తున్న ఐదుగురిని పట్టుకున్నారు. విచారించగా వేసవి సెలవులు ఉన్నందున బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్‌లో పని చేయించేందుకు బాలురలను తరలిస్తున్నట్లు రవాణాదారులు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుకున్న బాలురను చైల్డ్‌లైన్‌కు అప్పగించినట్లు చెప్పారు. తనిఖీలల్లో రైల్వే సీఐ రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌కు 5రోజుల వరుస సెలవులు

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 4 : వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా ఐదు రోజులు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం బాబూజగ్జీవన్‌రామ్ జయంతి, శనివారం వారాంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం అమావాస్య సందర్భంగా సెలవు, మంగళవారం ఉగాది పండగను పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్లు తెలిపారు. బుధవారం నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, వ్యాపారులు, కార్మికులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కార్యదర్శి ఆ ప్రకటనలో కోరారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష తేదీలు ఖరారు

హనుమకొండ టౌన్ / కేయూ క్యాంపస్, ఏప్రిల్ 4 : ఎంపీఈడీ, బీపీఈడీ పరీక్ష తేదీలను గురువారం కేయూ పరీక్షల విభాగం ప్రకటించింది. ఈనెల 18, 20, 23, 25 తేదీల లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎంపీఈడీ మొదటి సెమిస్టర్, ఈనెల 16, 19, 22, 24 తేదీలలో ఎంపీఈడీ థర్డ్ సెమిస్టర్ పరీక్షలు, అదే విధంగా ఈనెల 16, 18, 20, 22 తేదీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు.

ముగిసిన ఇంటర్ స్పాట్

వరంగల్ ఎడ్యుకేషన్ మార్చి 4 : ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ గురువారంతో ముగిసింది. మార్చి 16 నుంచి హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న స్పాట్ క్యాంపు ముగిసిందని క్యాంపు ఆఫీసర్ ఎ.గోపాల్, అదనపు క్యాంపు అధికారి కె. మాధవరావులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి జనరల్ విభాగంలో 7.5 లక్షల జవాబు పత్రాలు రాగా, వొకేషనల్ విభాగంలో 1.5 లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. వీటన్నింటి మూల్యాంకన ప్రక్రియ పూర్తియ్యిందని తెలిపారు. స్పాట్ క్యాంపులో 361 మంది సీఈలు, 1,838 మంది ఏఈలు, 361 మంది స్క్రూటిని సిబ్బంది పాల్గొన్నట్లు వారు తెలిపారు. మూల్యాంకన ప్రక్రియ పూర్తి కావడంతో మరో పది రోజుల్లో బోర్డు మార్కుల పోస్టింగ్‌ను పూర్తి చేసి ఫలితాలు ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

ఈనెల 12వ తేదీ వరకు నిర్వహణ

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : జేఈఈ మెయిన్స్ పరీక్ష హనుమకొండ నగరంలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమైంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన షిఫ్ట్-1 పరీక్షకు మొత్తం 790 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 716 మంది హాజరు కాగా 74 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 90.63 శాతం మంది విద్యార్థులు మొదటి షిఫ్ట్‌లో హాజరయ్యారు. ఇక మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన రెండవ షిఫ్ట్ పరీక్షకు మొత్తం 790 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 713 మంది హాజరు కాగా 77 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 90.25 శాతంమంది విద్యార్థులు మొదటిషిఫ్ట్‌లో హాజరయ్యారు. కాగా నగరంలోని అయాన్ డిజిటల్ జోన్, ఎర్రగట్టు గుట్ట, నోబుల్ టెక్నాలజీస్, చింతగట్టు, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల బొల్లికుంటలో గురువారం జేఈఈ మెయిన్స్-2024 పరీక్షలు ప్రారంభమయ్యాయి. నగరంలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో ఈనెల 12 వరకు రెండు షిఫ్టుల్లో జరిగే పరీక్షకు 8,627 మంది పరీక్ష రాయనున్నారు.

భార్యకు దూరంగా ఉంటున్న భర్తపై దాడి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 4 : విడాకుల కేసు కోర్టులో కొనసాగుతోండగానే భార్య కుటుంబసభ్యులు భర్తపై దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి గురువారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని రాయపురాకు చెందిన గుండెబోయిన మహేశ్ ఆయన భార్య అపర్ణకు సంబంధించి విడాకుల కేసు గత రెండేళ్ల నుంచి కోర్టులో కొనసాగుతోంది. ఈ క్రమంలో అపర్ణ కుటుంబసభ్యులు మ్యాదరబోయిన రాజేందర్, మ్యాదరబోయిన రాజ్‌కుమార్, రవి ఈనెల 1న రాయపురలోని మహేశ్ ఇంట్లోకి చొరబడి వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు మనుషులపై దాడి చేశారు. బాధితుడు బుధవారం ఫిర్యాదు చేయగా నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు వరం.. బీసీ గురుకులం..


ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎంజేపీ కళాశాలలో విద్యార్థులకు పాఠాన్ని బోధిస్తున్న లెక్చరర్

కేసముద్రం, ఏప్రిల్ 4 : పదో తరగతి పూర్తిచేసి.. ప్రతిభావంతులైన వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఇంటర్ విద్యను అందించేందుకు మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎంజేపీటీబీసీ డబ్ల్యూ) ఆధ్వర్యంలో నిర్వహించే రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు వరంగా మారాయి. వెనుకబడిన తరగతుల విద్యార్థుల్లోని ప్రతిభకు వెలికితీస్తూ వారి బంగారు భవిష్యత్‌కు ప్రభుత్వ గురుకుల కళాశాలలు బాటలు వేస్తున్నాయి. పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు ఐఐటీ, ఎంసెట్, నీట్ ప్రవేశపరీక్షల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యనందిస్తూ రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 29 మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల జూనియర్ కళాశాలలను రాష్ట్రప్రభుత్వం నెలకొల్పింది. వీటిలో 15 బాలురకు, 14 బాలికల కోసం ఏర్పాటు చేశారు. 2024-2025 విద్యా సంవత్సరానికి ఇంటర్ అడ్మిషన్ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు పదో తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్రైవేటు కళాశాలలు, హాస్టళ్లలో ఫీజులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ గురుకులాల్లో చేర్పించేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఇంటర్మీడియట్, ఒకేషనల్ కోర్సుల్లో ఆంగ్లమాధ్యమంలో విద్యతోపాటు ఉచితంగా భోజన, వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. ప్రవేశపరీక్షలోని మార్కులు, రిజర్వేషన్లను అనుసరిస్తూ సీట్లను భర్తీ చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2,480 సీట్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 29 మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల జూనియర్ కళాశాలల్లో 2480 సీట్లున్నాయి. వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఏడు కళాశాలల చొప్పున, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో ఐదు చొప్పున, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మూడు చొప్పున మొత్తం 29 కళాశాలలున్నాయి. ఈ 29 కళాశాలల్లో 15 బాలురకు, 14 బాలికలకు కేటాయించగా బాలురకు 1,360 సీట్లు, బాలికలకు 1,120 సీట్లు మొత్తం 2,480 సీట్లు ఉన్నాయి. ఈ గురుకులాల్లో బీసీలకు 75 శాతం సీట్లు కేటాయించగా ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 5శాతం ఓసీ లేదా ఈ బీసీలకు 2శాతం, అనాథలకు 3 శాతం సీట్లు కేటాయించారు. ఆయా రిజర్వేషన్లలోనే 3శాతం దివ్యాంగులకు, 25 శాతం సీట్లను జ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లో, బీసీ సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు కేటాయించారు. ప్రవేశ పరీక్షకు 2024లో పదో తరగతి రెగ్యులర్‌లో పూర్తి చేసిన వారే అర్హులు. గతంలో పాసైన వారు, సప్లిమెంటరీ రాసిన వారు ప్రవేశానికి అనర్హులుగా పరిగణిస్తున్నారు.


జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలోని జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల ప్రాంగణం

- ఇంటర్‌లో ఉచిత వసతి, విద్య
- ఐఐటీ, నీట్, ఎంసెట్‌లో శిక్షణ
- 'సూపర్-100' పేరుతో ప్రత్యేక కోచింగ్
- బీసీలకు 75 శాతం సీట్లు రిజర్వు
- ఉమ్మడి జిల్లాలో 29 కళాశాలలు 2,480 సీట్లు
- ప్రవేశ పరీక్ష కోసం 12వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

గురుకుల కళాశాలల ప్రత్యేకతలు, సౌకర్యాలివే..

- కళాశాలల్లో ఉచిత విద్యతోపాటు వసతి, భోజనం
- ఆంగ్ల మాధ్యమంలోనే బోధన
- ప్రతీ తరగతి గదిలో డిజిటల్ క్లాసులు
- విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం.
- ఉదయం వ్యాయామంతో ప్రారంభించి 7.30 నుంచి 9గంటల వరకు బోధన కార్యక్రమాలు
- మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఆట స్థలాల సౌకర్యం
- ఉచిత బెడ్డింగ్ మెటీరియల్, యూనిఫాం, నోట్ బుక్స్ పాఠ్యపుస్తకాలు
- కాస్మెటిక్ చార్జీల చెల్లింపు
- విద్యార్థులపై 24గంటల పాటు అధ్యాపకుల పర్యవేక్షణ
- ఇంటర్‌తో పాటు ఐఐటీ, నిట్, ఎంసెట్, నీట్‌లో శిక్షణ.
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక చేసి 'సూపర్-100' బ్యాచ్‌గా ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ఐఐటీ, నీట్, ఎంసెట్‌లలో శిక్షణ.



ఎంజేపీ గురుకుల కళాశాల బాగుంది..

- సందిరి రవి, విద్యార్థి తండ్రి, కేసముద్రం స్టేషన్

మహబూబాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో నా కుమారుడు జగదీశ్వర్ ఇంటర్ సీఈసీ పూర్తి చేశాడు. నాణ్యమైన విద్య, బోధన ఈ కళాశాలలో అందుతాయి. పేద, మధ్య తరగతి వర్గాల తల్లిదండ్రులకు ఈ గురుకుల కళాశాలలు ఒక వరంగా మారాయి. ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి..

- వై.మనోహర్‌రెడ్డి, ఆర్‌సీవో, ఎంజేపీ గురుకులాల ఉమ్మడి వరంగల్ జిల్లా

వెనుకబడిన తరగతుల విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో ఉచిత బోధన కల్పించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గత ఏడాది ఇంటర్ ప్రవేశపరీక్షను ఉమ్మడి జిల్లాలో 6 వేల మంది విద్యార్థులు రాశారు. ఈ గురుకులాల్లో అన్ని అర్హతలు గల లెక్చరర్లతో విద్యాబోధన ఉంటుంది. ఇంటర్‌తో పాటు ఎంసెట్, ఐఐటీ, నీట్ తదితర ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఉటుంది. మెరుగైన విద్యార్థులకు 'సూపర్-100' గ్రూప్‌కు ఎంపిక చేసి సీవోఈ కళాశాలలో ప్రత్యేకంగా ఐఐటీ, నీట్ తదితర ప్రవేశ పరీక్షలకు శిక్షణనిస్తారు.

జిల్లాల వారీగా కళాశాలలు..

ఉమ్మడి జిల్లాల్లోని జనగామ జిల్లాలో బచ్చన్నపేటలో బాలికలు, బాలురకు వేర్వేరు గురుకులాలున్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్‌లో బాలురు, రఘునాథపల్లిలో బాలికలు, మొండ్రాయిలో బాలికలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొగుళ్లపల్లిలో బాలురు, గాంధీనగర్ ఘన్‌పూర్‌లో బాలికలు, భూపాలపల్లిలో బాలురు, ములుగు జిల్లా వెంకటాపురంలో బాలురు, పాకాల కొత్తగూడలో బాలికలు, మహబూబాబాద్ జిల్లా మరిపెడలో బాలికలు, గుమ్ముడూరులో బాలురు, పెద్దవంగరలో బాలురు, పెద్దగూడూరులో బాలికలు, దంతాలపల్లిలో బాలురు, వరంగల్ జిల్లా నెక్కొండలో బాలికలు, నల్లబెల్లిలో బాలురు, సంగెంలో బాలురు, వరంగల్‌లో బాలికలు, ఖిలా వరంగల్‌లో బాలురు, తిమ్మాపూర్‌లో బాలికలు, వర్ధన్నపేటలో బాలికలు, హన్మకొండ జిల్లా శాయంపేటలో బాలురు, ఆత్మకూరులో బాలికలు, హన్మకొండలో బాలురు, కాజీపేటలో బాలికలు, ఐనవోలులో బాలురు, కమలాపూర్‌లో బాలురు, బాలికలకు వేర్వేరుగా కళాశాలలున్నాయి.

బాలికను వేధించిన యువకుడి అరెస్టు

శాయంపేట(హనుమకొండ జిల్లా), ఏప్రిల్ 4 : ప్రేమపేరుతో ఓ బాలికను వేధింపులకు గురిచేసిన యువకుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు. కొప్పులకు చెందిన పసుల శివరాజ్ ఓ బాలికను నెలరోజులుగా ప్రేమపేరుతో వేధిస్తున్నాడని చెప్పారు. ఈక్రమంలో ఈనెల 2న రాత్రి గ్రామంలో కిరాణంషాపుకు వెళ్తున్న బాలికను వేధించాడు. దీంతో ఆ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేయడంతో శివరాజ్‌పై కేసు నమోదు చేశారు. గురువారం నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

110 ఏళ్ల అమ్మకు అన్నీ తానై..

ఆస్తుల్లేకపోయినా సాకుతున్న వృద్ధురాలు

నర్సంపేట టౌన్, మార్చి 4 : ఆస్తులు లేవు.. పనులు చేసుకునేందుకు సత్తువ లేదు. ప్రభుత్వం నుంచి వచ్చే వృద్ధాప్య పింఛనే ఆసరాగా నూరేళ్ల వయసుపైబడిన తల్లిని సాకుతోంది 80ఏళ్ల వృద్ధురాలు. ఆరోగ్యం సహకరించకపోయినా, ఓ కన్ను కనిపించకపోయినా కని పెంచిన అమ్మ బాగోగులు చూస్తోంది. ఆస్తులు పంచి ఇచ్చిన తల్లిదండ్రులను కూడా వదిలేస్తున్న వారున్న ప్రస్తుత పరిస్థితుల్లో కష్టాలెన్ని ఎదురైనా తల్లిని కంటికిరెప్పలా కాపాడుకుంటోంది నర్సంపేట మండలం జీజీఆర్ పల్లె గ్రామానికి చెందిన నానబోయిన వెంకటమ్మ. దీనికి సంబంధించిన వివరాలివీ.. జీజీఆర్‌పల్లె గ్రామానికి చెందిన వేల్పుల మలమ్మకు 110 ఏళ్లు. మల్లమ్మ భర్త మల్లయ్య కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి ఇద్దరు కూతుర్లు కాగా వారికి వివాహాలయ్యాయి. ఓ కూతురును వేరే ఊరు ఇవ్వగా.. వెంకటమ్మను తమ స్వగ్రామంలోనే ఇచ్చారు. అయితే వెంకటమ్మ భర్త కూడా గతంలోనే మృతిచెందడం.. ఆమె ఇద్దరు కుమారులు కూడా వివాహాలై వేర్వేరుగా ఉంటుండగా వారి ఆర్థిక పరిస్థితి కూడా అంతంతమాత్రమే. ఈ క్రమంలో ఒంటరిగా ఉన్న వెంకటమ్మ.. 110ఏళ్ల పైబడిన తల్లి మల్లమ్మను ఒంటరిని చేయకుండా తనకున్న గుడిసెలోనే ఉంచి సపర్యలు చేస్తోంది. అయితే వెంకటమ్మ వయసు 80 సంవత్సరాలు కాగా ఆరోగ్యం సహకరించకపోయినా.. ఓ కన్ను సరిగా కనిపించకపోయినా తల్లి ఆలనాపాలనా మాత్రం మరవలేదు. ఉండడానికి పూరిగుడిసె తప్ప ఎలాంటి ఆస్తులు, ఆదాయం లేకపోవడంతో తల్లీకూతుళ్లకు ప్రభుత్వం నుంచి వస్తున్న వృద్ధాప్య పింఛనుతోనే బతుకీడుస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, దాతలు తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


తల్లితో కూతురు వెంకటమ్మ

నేడు బాబు జగ్జీవన్‌రాం జయంతి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 4: భారత తొలి ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం 116వ జయంతి వేడుకలను మార్చి5న శుక్రవారం ఉదయం నిర్వహిస్తామని కేయూ ఎస్సీఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ తుమ్మల రాజమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్య కేంద్రం వద్ద గల బాబు జగ్జీవన్‌రాం కాంస్య విగ్రహానికి పూలమాలతో నివాళులర్పిస్తాని వెల్లడించారు. అనంతరం కేయూ సెనెట్ హాల్‌లో కంటెపపరీ ఇష్యూష్ ఆఫ్ ఇండియా సొసైటీ అనే అంశంపై జరిగే సదస్సులో మాజీ తెలంగాణ, ఏపీ హైకోర్టు జడ్జీ బి. చంద్రకుమార్ కీలక ప్రసంగం చేస్తారన్నారు.

రేగులగూడెం వాసికి డాక్టరేట్



కాటారం, ఏప్రిల్ 4: భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధి బూడిదపల్లి గ్రామానికి చెందిన పొన్న మహేష్‌కుమార్ డాక్టరేట్(డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) పట్టా సాధించారు. కాకినాడ జేఎన్‌టీయూ ద్వారా కంప్యూటర్ సైన్స్ ఆఫ్ ఇంజనీ రింగ్(సీఎస్ఈ) విభాగంలో డాక్టర్ ఫిలాసఫీ అవార్డు పొందారు. 'ఎఫిషియంట్ అప్రోచెస్ ఫర్ డ్రైవింగ్ హై యుటిలిటీస్ ఫ్రం డాటా స్ట్రీమ్స్' అనే సిద్ధాంత వ్యాసాన్ని ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సమర్పించడంతో మహేష్ కుమార్ పీహెచ్‌డీ సాధించారు.



క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రోషోల ఫ్లెక్సీ



స్ప్రింగ్ స్ప్రీకి ముస్తాబైన నిట్ ప్రధాన గేట్ తోరణం

నేటి నుంచి నిట్‌లో వసంతోత్సవం

- మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించనున్న 'టెక్నోక్రాట్స్'
- సాయంత్రం ప్రారంభించనున్న డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి
- భావిభారత ఇంజనీర్ల కల్చరల్ ఫెస్ట్‌కు ముస్తాబైన ప్రాంగణం
- హాజరుకానున్న 10 వేలమంది విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : కాజీపేటలోని నిట్ ప్రాంగణంలో సందడి నెలకొననుంది. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు 'టెక్నోక్రాట్స్' సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు దుమ్మురేపనున్నారు. ఈ ఏడాది 'సృజనాత్మకత శక్తితో కూడిన పండుగను వాగ్దానం చేయడం, పాల్గొనే వారి గత పరిమితులను అధిగమించి వారిలో దాగిఉన్న శక్తిని బయటకు తీయడం (ఋతుఘాఎఆ)' అనే థీమ్‌తో వసంతోత్సవాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దారు. భావిభారత ఇంజనీర్లు సాంస్కృతిక సంబరాల్లో మునిగి తేలనున్నారు. ఈ స్ప్రింగ్‌స్ప్రీలో నిట్‌లోని విద్యార్థులతో పాటు మొత్తం 10 వేలమంది స్టూడెంట్స్ కేరింతలు కొట్టనున్నారు. నేడు సాయంత్రం నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని నిట్ స్టూడెంట్స్ డీన్ వెల్ఫేర్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షిస్తున్నారు.

స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమాలు ఇలా..

● మొదటి రోజు

అన్ సాల్వ్‌డ్ నుక్కడ్ నాటకం, నిట్ వరంగల్ గాట్ టాలెంట్, ఫిల్మ్ ట్రెజర్ హంట్, ఫిల్మ్ క్విజ్, కొరియో నైట్, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, ఫుడ్ హంట్‌తో పాటు ప్రోషోలో ప్రముఖ గాయకుడు హరిచరణ ఆధ్వర్యంలో చౌరస్తా బ్యాండ్ కార్యక్రమం ఉర్రూతలూగించనుంది.

రెండోరోజు..

నిట్ వరంగల్ సోలో ఐడల్, డైరెక్టర్స్ కట్, ఫిల్మ్‌క్విజ్, హంగ్‌గేమ్స్, ఫొటో పజిల్‌తో పాటు నకాష్ అజీజ్, లాహోర్ ద బ్లాక్ స్మిత్ బృందం ప్రోషోలో విద్యార్థులను తన్మయత్వంలో ముంచనున్నారు.

మూడోరోజు..

జనరల్ క్విజ్, డైరెక్టర్స్ కట్, సీపీఆర్ రిలేతో స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమం ముగియనుంది.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో కేజీబీవీ విద్యార్థినికి బంగారు పతకం


స్రవంతిని అభినందిస్తున్న డీఈవో

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పథకం సాధించిన వేలేర్ కేజీబీవీ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని సీహెచ్. స్రవంతిని డీఈవో అబ్దుల్‌హై అభినందించారు. జీసీడీవో సునిత ఆధ్వర్యంలో బంగారు పతకం సాధించిన స్రవంతిని డీఈవో కార్యాలయంలో డీఈవో అబ్దుల్ హై పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. కాగా గత నెల 29 నుంచి ఏప్రిల్ 1 వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టు తరపున పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభను కనబరిచి బంగారు పతకాన్ని సాధించింది. జీసీడీవో సునిత, పీఈటీ కిరణ్మయి, ఎస్‌వో స్రవంతి, హనుమకొండ సాఫ్ట్‌బాల్ సెక్రెటరి తాబేటి రాజేందర్ తదతరులు స్రవంతిని అభినందించారు.



కాంస్య పతకం, ప్రశంసా పత్రం


సాంబమూర్తి

చిత్రకళలో సాంబమూర్తికి కాంస్య పతకం

కరీమాబాద్, ఏప్రిల్ 4 : రంగ్-23 2వ నేషనల్ వైడ్ ఆర్ట్ అండ్ పెర్ఫార్మెన్స్ కాంపిటీషన్‌లో ఉర్సు కుమ్మరివాడ ప్రాంతానికి చెందిన ఆవునూరి సాంబమూర్తి కాంస్య పతకం సాధించాడు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ ఆధ్వర్యంలో ఏక్ భారత్ శ్రేష్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చిత్రకళ పోటీలను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ముంబాయిలోని వెర్సోవా వెల్ఫేర్ అసోసియేషన్ హైస్కూల్‌లో గత ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో నిర్వహించారు. సాంబమూర్తి 'సర్వాంతర్యామి భారత్' అనే సందేశం చిత్రాన్ని పోస్టు ద్వారా కాంపిటీషన్‌కు పంపించాడు. 40నుంచి 60 ఏళ్ల కేటగిరీలో ఆయనకు తృతీయ బహుమతిని లభించింది. నిర్వాహకులు సాంబమూర్తికి సమాచారం అందించి, కాంస్య పతకాన్ని, ప్రశంసా పత్రాన్ని పోస్టుద్వారా పంపించగా గురువారం ఉదయం తనకు చేరినట్లు సాంబమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

అక్కంపేటలో తాగునీటికి కటకట

● వారం రోజులుగా ప్రజల ఇబ్బందులు ● వ్యవసాయ బావుల వద్దకు పరుగులు

ఆత్మకూరు (హనుమకొండ జిల్లా), ఏప్రిల్ 4 : మండుతున్న ఎండలకు ప్రజల దాహార్తిని తీర్చాల్సిన అధికారులు పత్తాలేకుండా పోవడంతో నల్లానీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో వారం రోజుల క్రితం మిషన్ భగీరథ పైపులైన్ పగిలిందని గుంతలు తీయించారు. వారం రోజులు గడిచినా మరమ్మతులు చేయకపోవడంతో తాగునీరు లేక ప్రజలు వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకూడదని ప్రభుత్వం ఎన్నిసార్లు హెచ్చరించినా అధికారుల తీరు మారడం లేదు. పలుమార్లు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీరు అందించాలని వేడుకుంటున్నారు. లేని పక్షంలో ఖాళీ బిందెలతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పట్టించుకోని అధికారులు..

సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యతను ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో అధికారులు పత్తాలేకుండా పోవడంతో నీటి సమస్యను ఎవరు పరిష్కరించాలని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు.


మరమ్మతుల కోసం గుంత తవ్వి వదిలిన దృశ్యం

పల్లెల్లో మంత్రి సీతక్క పర్యటన



మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, ఏప్రిల్ 4: మంత్రి సీతక్క ములుగు మండలంలోని పల్లెల్లో గురువారం పర్యటించారు. పత్తిపల్లి గ్రామానికి చెందిన దాసరి కట్టయ్య, బుర్ర ఐలయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబాలను పరామర్శించారు. చిత్రపటాల వద్ద వాళులర్పించి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. గుర్తూరుతండాలో తల్లిదండ్రులు లేని ఓ లంబాడా గిరిజన యువతి మూడ్ అఖిల వివాహానికి మంత్రి సీతక్క చేయూతనిచ్చారు. ఆమె ఆర్థిక సాయం ప్రకటించగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవిచందర్, పార్టీ మండల అధ్యక్షుడ ఎమ్డీ.చాంద్‌పాషా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల భరత్‌కుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ బొక్క సత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపేటలో..

వెంకటాపూర్(రామప్ప): మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో ఇటీవల మృతిచెందిన ఎంబటి సుశాంత్, ముదురుకోళ్ల రాజేష్ కుటుంబాలను మంత్రి ధనసరి సీతక్క పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె వెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కంచే.. చేను మేస్తే..

ఓ స్వచ్ఛంద సంస్థలో ఉద్యోగి అవినీతి బాగోతం

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 4: అదొక స్వచ్ఛంద సంస్థ. దాని సంకల్పం.. లక్ష్యం అత్యున్నతం. అయినా అందులో పనిచేసే ఓ ఉద్యోగి నిర్వాకం మాత్రం ఆ సంస్థకు చెడు పేరు తెచ్చేలా ఉంది. కంచె చేను మేసినట్టు అతడు వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది.

జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో కొనసాగుతున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌లో (ఆర్‌డీటీ) పనిచేసే ఓ ఉన్నత శ్రేణి ఉద్యోగి అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. రూపాయి ఖర్చయితే.. పది రూపాయల బిల్లు పెట్టుకుంటున్నట్లు విమర్శలున్నాయి. నిరుపేదల అభివృద్ధికి ప్రతి ఏడాది ఆ సంస్థ సుమారు రూ.4 కోట్ల నుంచి రూ.5కోట్లు ఖర్చు చేస్తున్నా.. అందులో కొంత మొత్తం దుర్వినియోగం అవుతోందనే ఆరోపణలున్నాయి. అందులో పనిచేసే పెద్దసారే బినామీ పేర్లతో బిల్లులు కాజేస్తున్నాడనే వాదనలు వినిపిస్తున్నాయి.

లక్ష్యం గొప్పదైనా..

ఆర్డీటీ సంస్థను 1969లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురంలో ఏర్పడింది. విన్‌సెంట్ ఫెర్రర్, యెనీఫెర్రర్ అనే వ్యక్తులు దీనిని స్థాపించారు. పేదరికాన్ని నిర్మూలించడం, అణగారిన వర్గాలను సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయడం దీని ముఖ్యోద్దేశం. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో కూడు, గూడు, నీడ లేని వారికి ఆసరా కల్పించడమే కాకుండా వారి పిల్లలకు విద్య, వైద్య రంగాల్లో ఈ సంస్థ సేవలందిస్తోంది. ఏడాదికి సుమారు రూ.5కోట్లు ఖర్చు చేస్తూ ప్రతి నిరుపేద కుటుంబానికీ ఇల్లు కట్టిస్తూ, మౌలిక సౌకర్యాలు కల్పిస్తోంది. మహిళా గ్రూపులను తయారుచేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తోంది. భూపాలపల్లిలో ఈ సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి 25గ్రామాల్లో దీని కార్యకలాపాలు విస్తరించాయి. నిరుపేద కుటుంబాలకు ఇళ్ల నిర్మాణంతో పాటు విద్య, వైద్య సౌకర్యాలు అందిస్తోంది. 40 గ్రామాలను ఎంపిక చేసి అక్కడున్న బాలింతలు, గర్భిణులు, వృద్ధులకు, నాలుగేళ్లలోపు శిశువులకు పౌష్టికాహారం అందిస్తోంది. అంతేకాకుండా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలకు కావాల్సిన డెస్క్ బెంచ్‌లు, ఇతరత్రా సామగ్రితోపాటు ఆట వస్తువులను, యూనిఫాంలను సైతం సమకూరుస్తోంది.

ఉద్యోగి నిర్వాకం ఇలా...

అందులో పనిచేసే ఉన్నత శ్రేణి ఉద్యోగి ఒకరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఆయనకు మరో ఇద్దరు కిందిస్థాయి ఉద్యోగులు సహకరిస్తున్నట్లు సమాచారం. ఈ సంస్థ చేపట్టే పనుల్లో బినామీ పేర్లతో అధిక బిల్లులు పెట్టి వాటిని కాజేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇంటి లబ్ధిదారుల పేర్లపై కూడా బిల్లులు పెట్టి సంస్థ సొమ్మును జేబులో వేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం వెంగళాపురం, ఒడ్డుగూడెంలో కోయలకు 74 ఇళ్ల నిర్మాణాలు ఆర్డీటీ చేపట్టింది. అయితే.. ఇంటి నిర్మాణంలో భాగంగా సేకరించే ప్రతి ముడిసరుకును కాంట్రాక్టరు, దుకాణ సముదాయాల ద్వారా సేకరించి బిల్లులు పెడుతోంది. అయితే... ఒడ్డుగూడెంలో బేస్‌మెంట్‌లో పోసిన ఫిల్లింగ్ సాండ్‌కు ఒక్కో ట్రిప్పు ట్రాక్టర్‌కు రూ.250 ఖర్చయితే బినామీ పేరుతో రూ.750 బిల్లు పెట్టుకున్నట్లు సమాచారం. ఇందులో మొత్తంగా 160 ట్రాక్టర్లకు రూ.40వేలు ఖర్చుకాగా అదనంగా రూ.1.20లక్షలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఇసుక పది టిప్పర్లకు ఓ ప్రజాప్రతినిధి చొరవతో రూ.1.60 లక్షలు ఖర్చు అయితే రూ.3.60 లక్షల బిల్లు తీసుకున్నట్లు సమాచారం. వెంగళాపురంలో ఫిల్లింగ్ సాండ్‌ను లబ్ధిదారులే పోసుకోవాలని ఆదేశించిన అతడు.. వారికి తెలియకుండా రూ.52వేల బిల్లును కాజేసినట్లు పలువురు చెబుతున్నారు. వెంకటాపూర్ మండలంలోని నల్లగుంటలోని ఓ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చదును కోసం ఎర్రమొరం పోయడానికి రూ.50 వేలు ఖర్చు కాగా రూ.1.20 లక్షలు బిల్లులు పెట్టుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి పనిలోనూ ఆ అధికారి, మరో ఇద్దరు సిబ్బంది మిలాఖతై పనిచేసే సంస్థ సొమ్మును అదనపు బిల్లులతో కాజేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

పెండింగ్ బిల్లులు చెల్లించండి..

కలెక్టర్ భవేష్ మిశ్రాకు మాజీ సర్పంచుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ సర్పంచులు

రేగొండ, ఏప్రిల్ 4: తమకు కేటాయించిన అభివృద్ధి పనులను అప్పులు చేసి చేపట్టామని, వాటి పెండింగ్ బిల్లులు చెల్లించాలని రేగొండ మండలానికి చెందిన మాజీ సర్పంచులు కలెక్టర్ భవేష్ మిశ్రాకు విజ్ఞప్తి చేశారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో గురువారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బిల్లులు ఇవ్వకుంటే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధి కోసం ఇటీవల ప్రభుత్వం పీఎఫ్ఎంఎస్ నిధులు విడుదల చేసినా తమకు బిల్లులు మాత్రం ఇవ్వడంలేదన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో నాడు పోటీపడి గ్రామాల అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రస్తుతం కొలువు దీరిన ప్రభుత్వమైనా తమ గోడును ఆలకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి, మాజీ సర్పంచులు ప్రసాదరావు, పాతుపల్లి సంతోష్, చిగురుమామిడి రజిత, దగ్గు సంధ్యారాణి, బండారి కవిత తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ సిరికొండ పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

చిట్యాల, ఏప్రిల్ 4: మండలంలోని చింతకుంట రామయ్యపల్లి గ్రామానికి చెందిన జెట్టి మల్లయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూద నాచారి గురువారం పరామర్శిం చారు. ఆయన వెంట నాయకులు చింతల రమేష్, రాజిరెడ్డి, సదానం దం, బాలకృష్ణ, వేముల శ్రీనివాస్, ఉప్పుల కిరణ్, గురుకుంట్ల కిరణ్, ముసాపూరి రవీందర్, పాల శంకర్ తదితరులు ఉన్నారు.

కొలతల ప్రకారం పనిచేయాలి

ఉపాధిహామీ పనులు పరిశీలించిన జడ్పీ సీఈవో

చిట్యాల, ఏప్రిల్ 4: ఈజీఎస్ సిబ్బంది సూచించిన మేరకు కొలత ప్రకారం పనిచేస్తే ఉపాధిహామీ కూలీలు రోజుకు రూ.300 పొందొచ్చని జడ్పీ సీఈవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని చల్లగరిగలో మామిడికుంట, ఊరచెరువులో పనులను ఆమె గురువారం పరిశీలిం చారు. ఉపాధిహామీ కూలీల హాజరును పరిశీలించి పలు సూచనలు చేశారు. వ్యవసాయ పనులు తగ్గిన దృష్ట్యా కూలీలు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికీ జాబ్‌కార్డు పొందని వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామాల్లో ఎక్కువ సంఖ్యలో ఉపాధిహామీ పనులకు హాజరయ్యే విధంగా అవగాహన కల్పించాలని, కూలీల వివరాలను రోజువారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఏపీవో అలీం, సిబ్బంది ఉన్నారు.

మునిసిపాలిటీ ఆధ్వర్యంలో చలివేంద్రం

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 4: పట్టణంలోని గణేష్ చౌరస్తాలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానికి అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. తీవ్రమైన ఎండలు ఉండడంతో ప్రజలు తాగునీటి కోసం తండ్లాడుతున్నారని అన్నారు. ఈ క్రమంలో వారు ఇబ్బందులు పడకుండా తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్‌రావు, ఆర్ఐ భాస్కర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుకు స్థల పరిశీలన

వాజేడు, ఏప్రిల్ 4: మండలంలోని చెరుకూరులో ధాన్యం తనిఖీ కోసం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు చేసే స్థలాన్ని అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ గురువారం పరిశీలించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ధాన్యం తెలంగాణకు వచ్చే అవకాశం ఉండడంతో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటుచేసి తరలింపుపై ఆంక్షలు విధించనున్నారు. ఈనేపథ్యంలో చెరుకూరులో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఈనెల 8న అధికారికంగా ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. రైతులెవరూ దళారులకు ధాన్యాన్ని విక్రయించొద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాలన్నారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు ఉన్నారు.

విద్యా రంగాన్ని కాపాడుకోవాలి: ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మంగపేట, ఏప్రిల్ 4: విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మండల పరిధి రాజుపేటలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యాభివృద్ధిలో ఈ పాఠశాల ముందంజలో ఉండటం అభినందనీయమని కొనియాడారు. పాఠశాల భవనం, మౌలిక సౌకర్యాలు, విద్యార్థుల క్రమ శిక్షణ, ఇతరత్రా అంశాలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. ఇందుకు ఉపాధ్యాయ బృందం కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మంగపేట సహకార సంఘం చైర్మన్ తోట రమేష్, పాఠశాల స్థల దాత ఉండవల్లి రమేష్, ప్రధానోపాధ్యాయుడు రావుల భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



ఎమ్మెల్యే గండ్ర సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న రాజిరెడ్డి

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 4: బీఆర్ఎస్ జిల్లా నాయకుడు నాగుల రాజిరెడ్డి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. భూపాలపల్లిలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, జిల్లా నాయకుడు పిప్పాల రాజేందర్, కౌన్సిలర్ శిరుప అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యం కేసు నమోదు



గద్దె సురేష్

కాటారం, ఏప్రిల్ 4: మండలంలోని బయ్యారం గ్రామానికి చెందిన గద్దె సురేష్(60) మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం మిస్సింగ్ కేసును నమోదు చేసినట్టు కాటారం ఎస్సై అభినవ్ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. సురేష్ దంపతులకు ఇద్దరు కుమార్తెలుండగా వివాహం జరిగింది. భార్యాభర్తలు బయ్యారంలో నివసిస్తున్నారు. సురేష్‌కు కొంతకాలంగా మతి స్థిమితం సరిగా లేదు. ఈ నెల 1న సురేష్ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో సురేష్ కూతురు సుజాత ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 8712658139, 8712658117 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : డీఎస్పీ

చిట్యాల, ఏప్రిల్ 4: గ్రామాల్లో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సంపత్‌రావు హెచ్చరించారు. ఈమేరకు మండలంలోని అందుకుతండ శివారు ఒంటిప్పతండాలో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వాహన పత్రాలు, నంబర్ ప్లేట్‌లేని 24 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను సీజ్ చేశారు. 25 లీటర్ల గుడుంబా, 1700 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నిషేధిత గుడుంబాను తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ సంపత్‌రావు గ్రామస్తులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, చట్ట వ్యతిరేక పనులకు పాల్పడి కేసుల పాలు కావద్దని సూచించారు. నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.యువకులు గుట్కా, పాన్‌మసాలా, మద్యపానం లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో సీఐ మల్లేష్, చిట్యాల, రేగొండ, టేకుమట్ల ఎస్సైలు శ్రావణ్‌కుమార్, షాఖాన్, రవికుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

గోదావరి కరకట్టను పరిశీలించిన కలెక్టర్

(5వ పేజీ తరువాయి)

వచ్చినప్పుడు వ్యవసాయ భూములు కోతకు గురవుతున్న విషయాన్ని అధికారులు, స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. వరదలు ఉప్పొంగితే మంగపేట, గంపోనిగూడెం, పొద్మూరు బోరునర్సాపురం గ్రామాలకు పెను ప్రమాదం ముంచుకొస్తుందని అధికారులు, స్థానికులు ఆమె దృష్టికి తెచ్చారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి వరద ముంపు ముప్పు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పొద్మూరు ముంపు ప్రాంతానికి 2.5 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మాణం కోసం 25 ఎకరాల స్థలం సేకరణ పూర్తయిందన్నారు. ఇరిగేషన్ సీఈ విజయ్ భాస్కర్, ఎస్ఈ మోహన్‌రావు, ఈఈ జగదీశ్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయ్ చందర్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి వేణు, తహసీల్దార్ వీరస్వామి, ఎంపీడీవో జి. కృష్ణప్రసాద్ ఉన్నారు.

‘ఉపాధి’ కూలీలకు సౌకర్యాలు కరువు : సీపీఎం

మంగపేట, ఏప్రిల్, 4: మండలంలోని మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు, పరికరాలు అందుబాటులో లేవని సీపీఎం ములుగు డివిజన్ సభ్యుడు ఎల్పీ. ముత్యాలు, మండల కార్యదర్శి జాగటి చిన్నా అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సీపీఎం నాయకులు గురువారం పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని మండిపడ్డారు. పనుల ప్రాంతాల్లో ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు టెంట్లు లేవని, తాగు నీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచలేవని అన్నారు. అధికారులు స్పందించి ఉపాధిహామీ కూలీలకు ఇప్పటికైనా కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వెంకన్న, సుమన్, నర్సింహరావు, నరేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూఎస్ మహాసభను విజయవంతం చేయండి : గట్టయ్య

కాకతీయఖని, ఏప్రిల్ 4: కార్మికుల హక్కుల కోసం తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న రామగుండం రీజియన్ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 7న గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

108 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 4: మండలంలోని అన్ని గ్రామాల్లో మూడేళ్లలోపు పిల్లలకు 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం ఏఎన్ఎంలకు 108సేవలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మూడేళ్లలోపు పిల్లలకు ఎమర్జెన్సీ ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే 108కు కాల్‌చేస్తే తక్షణమే భూపాలపల్లి, పరకాల ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు వరంగల్ ఎంజీఎంకు ఉచితంగా తరలిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి మృతదేహాలను ఉచితంగా ఇళ్లకు చేర్చుతున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పీహెచ్‌సీ డాక్టర్ నాగరాణి, 108 భూపాలపల్లి జిల్లా మేనేజర్ మెరుగు నరేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన చిరుతల రామాయణం



రామాయణం ఆఖరిఘట్టం ప్రదర్శిస్తున్న కళాకారులు

కాటారం, ఏప్రిల్ 4: మండలంలోని కాటారం జీపీ పరిధిలోని ఇప్పలగూడెంలో నాలుగు రోజులుగా సాగుతున్న చిరుతల రామాయణం వేడుకలు గురువారం వైభవంగా ముగిశాయి. రైతులు, కూలీలు పలువురు వివిధ రకాల పాత్రలను ధరించి పురాణ ఇతిహాసాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం 11గంటల వరకు ఏకదాటిగా రామరావణ యుద్ధం, రావణవధ, సీత అగ్నిప్రవేశం, సీతారాముల పట్టాభిషేకం తదితర ఘట్టాలతో ఆకట్టు కున్నారు. ఆది మహా కావ్యాన్ని చిరుతల రామాయణం రూపంలో ప్రదర్శించడం సంతోషంగా ఉందని పలుపాత్రధారులు సంతోషంతో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, పలు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్‌గా సునీల్ కుమార్



ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 4: భారతీయ జనతా పార్టీ లీగల్‌సెల్ జిల్లా కన్వీనర్‌గా కన్నోజు సునీల్‌కుమార్ నియామకమయ్యారు. ఈమేరకు ములుగులోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం సునీల్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందజేశారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 4: వేసవిలో మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ శ్రీనివాసరావు అన్నారు. గురు వారం ఆయన మండలం లోని పలు గ్రామాల్లో పర్యటించిన అనంతరం ఎంపీడీవో కార్యాల యంలో మిషన్ భగీరథ, ఆర్‌డ బ్ల్యూఎస్, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో పనిచే యని పైపులైన్‌లకు మరమ్మతులు చేయించడంతోపాటు లీకేజీలను అరికట్టాలని, మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంచేసి క్లోరినేషన్ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డీడబ్ల్యూవో స్వర్ణలత లెనిన, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంపీవో హనుమంతరావు, మిషన్ భగీరథ ఏఈ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ల పంపిణీ



వీల్‌చైర్లు అందిస్తున్న డీడబ్ల్యూవో

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 4: మండల కేంద్రంలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దాత మద్దాల వినోద్ గురువారం వీల్‌చైర్లను సమ కూర్చగా డీడబ్ల్యూవో స్వర్ణలత లెనిన పంపిణీ చేశారు. మండలం లోని వీరభద్రవరం గ్రామానికి చెందిన పాయం తనూజ, ఐలాల మెర్సీకు డీడబ్ల్యూవో చేతులమీ దుగా వీల్‌చైర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో శిరీష, ఏసీడీపీవో ముత్త మ్మ, సూపర్‌వైజర్ చంద్రకళ, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిడెం సాయిప్రకాశ్, సభ్యులు చిడెం సాయితేజ, వంశీకృష్ణ, రంజిత్‌కుమార్, రాము, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం రూరల్, ఏప్రిల్ 4: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సీఐ మండల రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరు మీద కొందరు వ్యక్తులు వాట్సాప్ గ్రూపుల్లో జాయిన్ అయి పలు మెసేజ్‌లు పెడుతూ మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఏపీకే ఫైల్‌ను డౌన్లోడ్ చేసుకోవడం వల్ల పూర్తి వివరాలు సైబర్ దొంగల చేతుల్లోకి వెళ్తాయని తెలిపారు. రెండు రోజుల క్రితం కన్నాయిగూడెం మండలానికి చెందిన ఓ వ్యక్తి ఆ ఫైల్‌ను డౌన్లోడ్ చేసుకొని డబ్బులు పోగొట్టుకున్నాడని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి ఏపీకే ఫైల్స్‌ను క్లిక్ చేయొద్దని సూచించారు.

వాహనాల తనిఖీ

ఏటూరునాగారం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ప్రధాన రహదారుల వెంట సీఐ రాజు ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఏటూరునాగారం మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిపోతున్న వాహనాలను తనిఖీ చేసి పత్రాలను పరిశీలించారు. ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

మల్హర్, ఏప్రిల్ 4: మండలంలోని మల్లారం గ్రామ పంచాయితీ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీవో శ్యామ్‌సుందర్ ఆదేశాల మేరకు జీపీ ఆవరణంలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి రాజుయాదవ్ తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రయాణికులు, గ్రామస్థుల సౌకర్యార్థం బస్టాండ్ సమీపంలో జీపీలో చలి వేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సుమలత, గ్రామస్థులు, జీపీ సిబ్బంది ఉన్నారు.

రాజకీయ నాయకుల ఫ్లెక్సీల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాటారం, ఏప్రిల్ 4:మండలంలోని కాటారం జీపీ పరిధిలో ఉన్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను అధికారులు గురువారం తొలగింప జేశారు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో ఈ మేరకు స్పందించారు. అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సఫీర్‌ఖాన్ కాటారంలో ఫ్లెక్సీని సిబ్బందితో తొలగింపజేశారు. శాశ్వతంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కనిపించకుండా చర్యలు చేపట్టారు.

ఇసుక లారీ పట్టివేత

వాజేడు, ఏప్రిల్ 4: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని మండలంలోని పేరూరు పోలీసులు గురువారం సాయంత్రం పట్టుకున్నారు. ఈ మేరకు ఎస్సై రమేష్ తెలిపారు. మండలంలోని దర్మారం గ్రామంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఓ లారీ తారసపడిందని, దానిని పరిశీలించగా నిబంధనలకంటే ఐదు టన్నుల అదనంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. లారీ అయ్యవారిపేట ఇసుక ర్యాంపుకు చెందినదని, దానిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని చెప్పారు.